ధాన్యం సొమ్ము చెల్లించరా..!

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
- రెండు నెలలైనా డబ్బు ఇవ్వరా

మామిడికుదురు: ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తాం. ఇదీ ప్రభుత్వం చెప్పిన మాట. దాన్ని ప్రతి ఒక్క రైతు నమ్మి ధాన్యం అమ్మారు. కానీ 48 గంటలు కాదు కదా వందల గంటలు దాటినా ధాన్యం సొమ్ము ఖాతాల్లో జమ కాక రైతులు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాళ్వా పంట ఒబ్బిడి చేసి ధాన్యం అమ్మాం. సొమ్ము వచ్చాక సార్వా సాగు చేపడతామనుకున్నాం. కానీ నెలలు గడుస్తున్నా ధాన్యం బకాయిలు చెల్లించడం లేదంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులోనూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపారు. సొమ్ముల చెల్లింపులోనూ ఇదే వైఖరి అవలంభిస్తున్నారంటూ తీవ్రంగా మండిపడుతున్నారు. రైతులకు ఎంత మొత్తం బకాయిలు చెల్లించాలన్న వివరాలు కూడా చెప్పేందుకు కూడా అధికారులు సాహసించడం లేదు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బయట మార్కెట్లో అమ్ముకుంటే క్యాష్ ఇచ్చేవారని, సొమ్ము చెల్లించలేనప్పుడు ధాన్యం ఎందుకు కొన్నారని ప్రశ్నిస్తున్నారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాలకు చెందిన వందల సంఖ్యలో రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉందని వాపోతున్నారు.


రైతుల నుంచి ధాన్యం కొనుగోలు (ఫైల్)

మూడు లక్షలు రావాల్సి ఉంది



భూమిని కౌలుకు తీసుకుని ఎంతో కష్టపడి దాళ్వా పంట పండించా. 230 బస్తాల ధాన్యం అమ్మా. నాకు రూ.మూడు లక్షలు రావాల్సి ఉంది. వాయిదాలు వేస్తున్నారు తప్ప సొమ్ములు మాత్రం ఇవ్వడం లేదు. ధాన్యం అమ్మి రెండు నెలలు కావస్తోంది. మొదట గత నెల 30కి ఇస్తామన్నారు. ఇప్పుడు ఈ నెల 15కి ఇస్తామంటున్నారు. ఇలా అయితే ఎలా. బయట మార్కెట్లో అమ్ముకుంటే ఎప్పుడో సొమ్ములు వచ్చేవి. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. వెంటనే బకాయిలు చెల్లించాలి.

– యనమదల రాజారావు, కౌలు రైతు, మామిడికుదురు

రెండు నెలలైనా సొమ్ము రాలేదు



ధాన్యం అమ్మి రెండు నెలలైనా ఇంకా సొమ్ములు రాలేదు. ఎప్పుడిస్తారో కూడా సరైన సమాధానం చెప్పే వారే కనిపించడం లేదు. మా పరిస్థితి అయోమయంగా ఉంది. రైతులకు అండగా ఉన్నామంటున్నారు. ఇదేనా ప్రభుత్వం ఇచ్చే అండ. 94 సారలు అమ్మాను. నాకు సుమారు రూ.60 వేల వరకు రావాల్సి ఉంది. మా లాంటి చిన్న రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఏం చేయాల్లో పాలుపోవడం లేదు. ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా దీనిపై స్పందించి రైతుల బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోండి.

– ఎండీ హసీం హుస్సేన్, రైతు, మామిడికుదురు

సార్వా సాగు చేసేదెలా?



రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ఇంత వరకు సొమ్ములు చెల్లించకపోతే ఎలా. ధాన్యం కొని రెండు నెలలైంది. నాకు ప్రభుత్వం నుంచి రూ.లక్ష రావాల్సి ఉంది. సార్వా సాగు చేసేందుకు పెట్టుబడి ఎక్కడి నుంచి తీసుకు రావాలో అర్థం కావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు పంట సాగు చేసేందుకు ఎలా ముందుకు వస్తారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు దీనిపై ఆలోచన చేయాలి. ఇటు వంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నయనాల పాపారావు, రైతు, మామిడికుదురు

క్లుప్తంగా

అభివృద్ధిపై గ్రామసభలో తీర్మానం


లూటుకుర్రు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై గ్రామసభలో సుదీర్ఘంగా చర్చించి వాటిపై తీర్మానాలు చేశారు. సర్పంచ్ అడబాల తాతకాపు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో శివాలయం ఎదురుగా ఉన్న చెరువుగట్టున పావంచా నిర్మించాలని తీర్మానించారు. కడలి వెంకటరత్నం ఇంటి నుంచి ఎన్టీఆర్ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరాలని సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల బహూకరణ


గూడపల్లిలో సైకిళ్లను అందిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ, దాతలు

మలికిపురం: మండలంలోని గూడపల్లి కొప్పిడి వారి మెరక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన యండమూరి సూరజ్ తన తల్లి పేరున రూ.7 వేల విలువైన సైకిళ్లను అందించారు. బుధవారం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం సమకూర్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను కూడా విద్యార్థులకు అందించారు. సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ కానూరి వెంకట్రావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుందర బ్రహ్మయ్య, కానూరి శ్రీను, పున్నం పద్దరాజు, బోనం ఉదయ్, గుండుమేను శ్రీను హెచ్ఎం జీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


దాత చిలుకూరి కిషోర్‌బాబుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పోలవరం మండలం మురమళ్లకు చెందిన గ్రంధి నాగ విశ్వేశ్వరరావు రూ.10,116, కాకికలూరు మండలం ఆరుతేగలపాడుకు చెందిన చిలుకూరి కిషోర్‌బాబు రూ.10,116లు విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు అయిన విల్లి సూర్యనారాయణమూర్తి అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ


అంతర్వేది దేవస్థానం పాఠశాలలో విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో ప్రముఖులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలోని ఎల్ఎన్ఎస్ టెంపుల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రజా ప్రతినిధులు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పి.నాగ శ్రీవిద్య అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ చింతా చిన్నా వీటిని అందజేశారు. గ్రామ పెద్దలు ఎస్.నరసింహారావు, పాఠశాల బోధనా సిబ్బంది గుబ్బల శ్రీనివాసు, సీహెచ్ భారతీదేవి పాల్గొన్నారు.

రైతులకు వెంటనే ధాన్యం డబ్బు చెల్లించాలి

కొత్తపేట: రబీ (దాళ్వా)లో పండించి అమ్మిన ధాన్యం డబ్బులు చెల్లించి, రైతుల ఇబ్బందులు తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతే రాజు.. రైతు లేనిదే తిండి లేదు అని పేర్కొన్నారు. రబీ పంట ధాన్యం డబ్బులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతులు ప్రస్తుతం ఖరీఫ్ పంటకు సిద్ధపడి నారుమళ్లు వేస్తున్నారని, పంట పెట్టుబడి పెట్టాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకొని తక్షణం రైతుల ఖాతాలకు ధాన్యం డబ్బులు జమ చేయాలని కోరారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అన్నీ నెరవేర్చుకొంటూ వస్తున్నారని, త్వరలోనే రైతుల పంట సొమ్ములు వేస్తారని పాలూరి ఆశాభావం వ్యక్తం చేస్తూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

బీజామృతంతో విత్తనశుద్ధి


దిండిలో రైతులకు బీజామృతం అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరాజు

మలికిపురం: ప్రస్తుత సార్వాలో బీజామృతంతో వరి విత్తనశుద్ధి ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని దిండి సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. మండలంలో దిండి గ్రామంలో రైతు శిక్షణ కేంద్రం వద్ద సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రైతులకు సామూహిక బీజామృతం తయారు చేసి అందించారు. ఈ బీజామృతం ద్వారా విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్లను పురుగులను గుడ్లను, భూమి నుంచి వచ్చే తెగుళ్లను సంక్రమించకుండా అరికట్టవచ్చని రైతులకు తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జ్ కిరణ్ మాట్లాడుతూ దీని తయారీకి ఎటువంటి పెట్టుబడి ఖర్చు లేదని బీజామృతం సహాయంతో విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల పంటకు రక్షణ లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క రైతు విత్తనశుద్ధి రాజీలేని సూత్రాలు పాటించడం ద్వారా పెట్టుబడి తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏ నాగదుర్గ, ఐసీఆర్‌పీ మౌనిక, కట్టా బాబు, బందెల మస్తాన్ రైతులు పాల్గొన్నారు.

'కేతా' కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ


ఎంపీపీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వేణు

రాజోలు: దివంగత కేతా శ్రీనివాసరావు కుటుంబాన్ని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ బుధవారం పరామర్శించారు. ఎంపీపీ కేతా శ్రీనివాసరావు ప్రస్తుత రాజకీయాల్లో యువనాయకుడిగా ఎదుగుతున్న సమయంలో ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. ఎంపీపీ శ్రీనివాసరావు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి మాజీ మంత్రి వేణు నివాళులర్పించారు. నాయకులు కంచి వెంకటరమణ, గుబ్బల నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా 'వేమా'



రాజోలు: బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వేమాను పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేమా జాతీయ మండలి సభ్యుడిగా ఎంపిక చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వేమా తెలిపారు.

మాధవ్ నియామకంపై హర్షం

సఖినేటిపల్లి: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ నియామకంపై ఆ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సఖినేటిపల్లిలో మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు హర్షం వ్యక్తం చేశారు. అలాగే నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా ఎంపికపై కూడా శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల ప్రధాన కార్యదర్శి బోణం నాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన

అయినవిల్లి: విలస గ్రామంలో ప్రకాశంవారిపాలేనికి వెళ్లే రోడ్డుని ఎంపీడీఓ జీవీ సరోవరరావు బుధవారం పరిశీలించారు. ఈ గ్రామంలోని రోడ్డుని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీఓ సరోవరరావు రోడ్డుని పరిశీలించి తగు న్యాయం చేస్తామని వారి హామీ ఇచ్చారు.

చెత్త సేకరణపై ఇంటింటా ప్రచారం


తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఉప సర్పంచ్ మునిరెడ్డి తదితరులు

రావులపాలెం: గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు చెత్త నిర్వహణపై అవగాహనతో మెలిగి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అన్నారు. బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో తడి పొడి చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. స్వచ్ఛ రావులపాలెం పేరుతో కరపత్రాలు ఇంటింటా పంపిణీ చేశారు. ఇంటి గోడలకు అంటించే స్టిక్కర్లను ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ పంపిణీ చేశారు.

ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు

మామిడికుదురు: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. అమలాపురంలో జరుగుతున్న బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ సభకు రాజోలు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి సూర్యారావు ఆధ్వర్యంలో భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. మామిడికుదురులో ఈ కార్యక్రమం రాజోలు నియోజకవర్గం ఇన్‌చార్జ్ కటకంశెట్టి ఆదిత్య స్వగృహం వద్ద బుధవారం పార్టీ జెండా ఊపి గొల్లపల్లి వాహన శ్రేణితో బయలుదేరి వెళ్లారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి కుటుంబానికి అందిన ఆర్థికసాయం, ప్రస్తుత కూటమి పాలనలో ఇంత వరకు అందిన ఆర్థికసాయాన్ని బేరీజు వేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చే దిశగా కార్యాచరణ చేపట్టామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని మేల్కొలుపుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బొలిశెట్టి భగవాన్, కుసుమ చంద్రశేఖర్, అడబాల బ్రహ్మాజీ, కట్టా శ్రీను, పాటి శివకుమార్, సూరిశెట్టి బాబి, రుద్రరాజు చిట్టిరాజు, తాడి సహదేవ్, నేతల నాని, ఉచ్చుల విష్ణు, రేవు జ్యోతి, చెల్లింగి ఈశ్వరి, ఎస్తేరు రాణి, మానుకొండ ప్రమీల, నయినాల సీతామహలక్ష్మి, ఎండీవై షరీఫ్, కంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


మామిడికుదురు నుంచి అమలాపురం సభకు తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

డెంగీపై అవగాహన కల్పించాలి


పెదపళ్ల పీహెచ్‌సీలో డెంగీ వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ


ఈదరాడలో నిర్వహించిన డెంగీపై అవగాహన ర్యాలీ

అలమూరు: డెంగీ వ్యాధిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈనెల ఒకటిన ప్రారంభమైన డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు 31 వరకూ జరుగుతాయన్నారు. అలాగే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డెంగీ వ్యాధి సోకకుండా తీసుకోవలలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్, ఏవీవీ రాజా సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ పి.రాజా రమేష్‌కుమార్, ఫార్మసిస్టు డి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరం వస్తే డాక్టర్ని సంప్రదించండి

మామిడికుదురు: హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తే డాక్టర్‌ని సంప్రదించాలని హెల్త్ అసిస్టెంట్ కొమ్మూరి ఉమా మహేశ్వరరావు సూచించారు. ఈదరాడలో బుధవారం డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ సోకిన వారికి కళ్లు కదిలించలేని పరిస్థితి, ఎముకల్లోను, కండరాల్లోనూ భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు, రేస్ వస్తాయన్నారు. డెంగీ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పి.శాంతకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు ఆదర్శనీయం


సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, ఎంపీడీఓ నరేష్‌కుమార్

కొత్తపేట: స్థానిక డిప్యూటీ ఎంపీడీఓగా డి.సుబ్బారావు పనితీరు, సేవలు ఆదర్శనీయమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. కొత్తపేట డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేసి, గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన సుబ్బారావు వీడ్కోలు సన్మానం మండల పరిషత్ సమావేశం హాలులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో ఎంపీపీ గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో డీఎల్‌డీఓ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ఎ.రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉన్నతాధికారుల మన్ననలు పొందుతూ తన ఉద్యోగ జీవితంలో ఏ చిన్న రిమార్కు లేకుండా ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారన్నారు. అనంతరం సుబ్బారావు–జ్ఞానేశ్వరి దంపతులను మండల పరిషత్ తరఫున ఎంపీపీ గంగాధరరావు, ఎంపీడీఓ నరేష్ కుమార్ టర్బన్ (వస్త్ర కిరీటం), భారీ గజమాల, శాలువా, సన్మానపత్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జెడ్పీ డిప్యూటీ సీఈఓ వీఎస్ఆర్ ఆచారి, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, గుణ్ణం రాంబాబు, బూసి జయలక్ష్మి, పల్లి బీమారావు, త్సామా బాబు, దూనబోయిన నవదీప, కుడుపూడి రామలక్ష్మి, మందపల్లి వీడీసీ కన్వీనర్ సాదు చెంచయ్య, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

స్టెతస్కోప్ బహూకరణ

సఖినేటిపల్లి: మోరిపోడు సుబ్బమ్మ మిషనరీ ఆసుపత్రి వైద్యురాలు లతా పాల్‌కు బుధవారం మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు హోల్డర్ చొప్పల రాజశేఖర్ అమెరికాకు చెందిన స్టెతస్కోప్‌ను బహూకరించారు. ఈ మేరకు సుబ్బమ్మ మిషనరీ ఆసుపత్రికి వెళ్లిన ఆయన, డాక్టర్‌కు స్టెతస్కోప్ ఇచ్చారు. వెంట తాడి సహదేవ్, నల్లి శివకుమార్, దేవ దయానంద్, రాపాక అజయ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు, అధికారులు

రావులపాలెం: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయుటకు రూ.2.62 కోట్లతో అభివృద్ధి చేసిన విద్యుత్ పనులను బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఊబలంక సబ్ స్టేషన్ పరిధిలో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 8 ఎంవీఏగా రూ.కోటి 12 లక్షలతో అభివృద్ధి చేశారు. అలాగే రావులపాడులో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాకు రూ.కోటి 50 లక్షలతో ఏర్పాటు చేసిన 11 కేవీ బ్రేకర్స్, 11 కేవీ ఎల్‌టీ లైన్లను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. మండలంలో రెండు చోట్ల అభివృద్ధి పనుల వల్ల భవిష్యత్తులో విద్యుత్ లోటు లేకుండా వ్యాపారులకు, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా చేయడానికి ఎటువంటి ఆటంకాలు ఉండవని లోడు సరిపోతుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆపరేషన్ ట్రాన్స్‌కో డీఈ కె.రాంబాబు, కన్‌స్ట్రక్షన్ విజయానంద్, ఆపరేషన్ ఏడి చిట్టిరాజు, కన్‌స్ట్రక్షన్ ఏడీ చంద్రశేఖర్ రావులపాలెం మండల ఏఈలు పి.నరేష్, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, డి.సాయికిషోర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం


మడికిలో కొబ్బరిచెట్టు పడి విరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరిస్తున్న విద్యుత్ శాఖ

ఆలమూరు: మండలంలోని మడికిలో కొబ్బరి చెట్టు పడి విద్యుత్ తీగలు తెగిన సంఘటనలో ఇద్దరికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం స్థానిక 216 ఏ జాతీయ రహదారి నుంచి కడియం మండలంలోని దుళ్ల వెళ్లే రోడ్డులో 11 కేవీ విద్యుత్ తీగలపై కొబ్బరిచెట్టు విరిగి పడిపోయింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో పాటు తీగలు చెల్లాచెదురై రోడ్డుపై పడ్డాయి. అదే సమయంలో ఆ ప్రదేశంలో బైక్ పక్కన నిలబడి ఉన్న ఇద్దరు యువకులు కొబ్బరి చెట్టు విరిగి పడుతున్న శబ్దాన్ని గ్రహించి వెనువెంటనే పక్కకు పరుగులు తీసి ప్రాణాలను దక్కించుకున్నారు. అలాగే అదే రోడ్డులో చిన్నారిని ఎత్తుకుని ఉన్న మహిళ కూడా ఈ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సంఘటన వివరాలను తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికపై స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను యథావిధిగా అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ప్రజల సమస్య పరిష్కారంలో 'నేను సైతం'

- అవిడి రాళ్లగుట్టపేటలో తాత్కాలికంగా రోడ్డు నిర్మించిన వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రతాప్
- ఎట్టకేలకు మట్టి రోడ్డుకు మోక్షం


నిన్న – అవిడి రాళ్లగుట్టపేట రోడ్డు దుస్థితి


నేడు – ఆధునీకరించిన అవిడి రాళ్లగుట్టపేట రోడ్డు

కొత్తపేట: గ్రామంలో ప్రజల సమస్య పరిష్కరించడంలో ప్రభుత్వాలు, పాలకులే కాదు 'నేను సైతం..' పరిష్కరించగలను అంటూ ముందుకు వచ్చిన యువ నాయకుడి ఔదార్యమిది. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని రోడ్డు సమస్యకు మోక్షం కల్పించారు. తన సొంత నిధులతో రోడ్డును వేయించారు. మండలంలోని అవిడి గ్రామ పంచాయతీ పరిధిలోని రాళ్లగుట్టపేటలో సుమారు 160 మీటర్ల పొడవున, 9 అడుగుల వెడల్పున పంచాయతీ రోడ్డు ఉంది. 1980లో ఆ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించారు. కాలక్రమేణా రోడ్డు పల్లమై మట్టితో కప్పుకుపోయింది. సుమారు ఆరేళ్ల క్రితం పంచాయతీ వారు గ్రావెల్ వేశారు. అదీ పోయింది. దీంతో సుమారు 50 నివాసాలు ప్రజలు గత కొన్నేళ్లుగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీ వారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటికే నిర్మించిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించక, నిధుల లేమితో ఈ రోడ్డు నిర్మాణంలో జాప్యం అవుతూ వచ్చింది. ఆ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి ప్రతాప్‌రెడ్డి కూడా ఆ ప్రాంతంలో ఒక నివాసితుడు. నలుగురితో నారాయణ మనకెందుకులే అని అనుకోకుండా రోడ్డు సమస్య పరిష్కరించాలని ముందుకు వచ్చారు. తన సొంత నిధులు రూ.20 వేలు వెచ్చించి బ్లాక్ మెటల్ చిప్స్ పరిచి ఆ రోడ్డును తాత్కాలికంగా నిర్మించారు. దాంతో ఆ రోడ్డు సమస్యకు మోక్షం లభించింది. ఆ ప్రాంత నివాసితులు ఇబ్బంది పడకుండా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతాప్‌రెడ్డి సేవా దృక్పథాన్ని, స్థానిక సమస్యపై చాటుకున్న ఔదార్యాన్ని స్థానికులు అభినందించారు.


గొల్లపల్లి ప్రతాప్‌రెడ్డి